నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | 21 ఆగస్టు, 2024 | www.navatelangana.com

## భూ కబ్జాలపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న భూకబ్జాలపై విచారణ చేపట్టాలని మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ జిల్లా కన్వీనర్ పొన్న రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని 147/2 సర్వే నెంబర్‌లోని భూమి కబ్జాకు గురవుతున్నట్లు పలు పత్రికలలో కథనాలు వచ్చినందున దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సర్వే నెం. 267లో నాలుగో తరగతి ఉద్యోగులకు కోసం 2008లో పట్టాలు పంపిణీ చేశారని, ఇందులో కూడా అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు.

## గంజాయి సాగుచేస్తున్న వ్యక్తికి జైలుశిక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గంజాయి సాగు చేస్తున్న కేసులో నిందితుడికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంపీ రమేష్ తీర్పు ఇచ్చారు. ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం అసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన చునర్కర్ ముకుందరావు తన వ్యవసాయ చేనులో పత్తితో పాటు గంజాయిని సాగు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు 2021 అక్టోబర్ 11న అప్పటి ఎస్సై చుంచు భూమన్న తనిఖీ చేసి సుమారు 50 గంజాయి చెట్లు లభ్యమయ్యాయని అప్పటి సీఐ అశోక్ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నిందితునిపై కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి విచారణ అనంతరం జిల్లా జడ్జి నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసై ఎవరూ తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలను, సాగు చేసిన, రవాణా చేసిన, విక్రయించిన వారి సమాచారాన్ని 87126 70506 నెంబర్‌కి కాల్ చేసి తెలియజేయాలని, వివరాలు తెలిపిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు.

## కొనసాగుతున్న రిమ్స్ జూడాల నిరసన

- ఏడో రోజుకు ఆస్పత్రిలో అవగాహన
- బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన అత్యాచారం ఘటన కలకలం రేపుతోంది. దేశమంతా ఏకమై బాధితురాలికి అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలో వైద్యులు, వైద్య విద్యార్థులు గత వారం రోజులుగా వివిధ పద్ధతుల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఏడో రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని రిమ్స్ సూపర్ స్పెషలిటీలో ఆత్మరక్షణ, లైంగిక దాడుల నేపథ్యంలో ఏ విధంగా వ్యవహరించాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలను గౌరించేలా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా రిమ్స్ జూడాల అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడుతూ కోల్‌కతాలో ఈనెల 8న జరిగిన ఘటన దారుణమన్నారు. ఈ ఘటనలో బాధితురాలికి అండగా దేశమంతా ముందుకు వచ్చిందని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. వైద్యవిద్యార్థిపై లైంగికదాడి, హత్య చేసిన నిందితులను శిక్షించాలని ఏడు రోజులుగా ఆందోళనలు చేపడుతున్నామన్నారు. హైకోర్టులో హియరింగ్ ఉందని, తమకు కోర్టుపై నమ్మకం ఉందన్నారు. ఇదే క్రమంలో మహిళలు, బాలికలు, ఆడ పిల్లలు తమ రక్షణకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూడాలు కారుణ్య, అన్వేష్, మౌనిక, సూరజ్, రాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరుగు బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటిందని అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అనేక హామీలు ప్రజలకు ఇచ్చిందని అన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన ప్రకారం తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇంటి స్థలం లేని వారికి ఇంటిస్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి రూ.10లక్షల ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ వాగ్దానం ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని, జీవన భృతి ఇవ్వాలని, రైతాంగ రుణాలను పూర్తిగా రద్దుచేసి బ్యాంకర్ల కొండి లేకుండా కొత్త రుణాలు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల బీమా వెంటనే అమలు చేయాలని, వాస్తవ సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలని, కౌలు రైతులను గుర్తించుటకు నిర్దిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు అంకుష్‌రావు, జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, గోరెమియా, వర్మ, మచ్చ శ్రీనివాస్, గోనె లచ్చన్న, మెస్రం ప్రభాకర్, భాస్కర్, దుర్వ రమేష్, కుమురం భాపురావు, నందు, పూసం అనూష, దుర్వా గంగామణి, కోవ కవిత, పూసం వనిత పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి

- ఎంపీఓకు కార్యదర్శుల వినతి



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల సస్పెండైన నార్నూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఆర్.దినేష్‌ని విధుల్లోకి తీసుకోవాలని మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వారికి ఉన్న సమస్యలపై ఎంపీఓ స్వప్నశీల, సూపరింటెండెంట్ గంగాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ముకుమ్మడిగా నాలుగు రోజుల సెలవు పెడుతున్నట్టు కార్యదర్శులు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో ఫిబ్రవరి నెల నుంచి ఎస్ఎఫ్‌సీ, పీఎఫ్ ఏంఎస్ నిధులు రాకపోవడంతో ఎంపీఎస్ డబ్ల్యూ వేతనాలు ఇవ్వలేదని దానితో వారు రోడ్లు డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు ముందుకు రావడం లేదని, అన్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనలేని స్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే పరిశుభ్రతతో పాటు మంచినీటి సరఫరా విద్యుత్ బల్బుల కోసం కార్యదర్శులు సొంత డబ్బులతో అప్పులు చేసి ఖర్చులు చేశామని పేర్కొన్నారు. మరో వైపు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల వేధింపులు ఎక్కువ అయ్యాయని ఈ సందర్భంగా వారి సమస్యలను ఎంపీఓకు తెలియజేశారు. సస్పెండ్ అయిన కార్యదర్శిని విధుల్లో తీసుకొని కార్యదర్శులకు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మండలంలోని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు సీహెచ్ నిరజ్, ఎం.విజయ్ కుమార్, ఎస్.రాజు, ఎ.రాంసింగ్, కే.కాశీరాం, ఎం.శ్రీనివాస్, ఎ.అవినాశ్, ఎ.శ్రీనివాస్, జే.రాధిక, కే.రాజశేఖర్, బి.రాజన్న, సీహెచ్ స్నేహ, శంకర్, మమత, ఎం.రమేష్ ఉన్నారు.

# కంపు కొడుతున్న ఎమ్మార్సీ కార్యాలయం

- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం శూన్యం




నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో నిలువ ఉంచిన మధ్యాహ్న భోజనం బియ్యం పురుగులు పడి కంపు కొడుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లభించలేదు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓలకు విన్నవించిన వారు విని విననట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కార్యాలయానికి వచ్చిన సిబ్బంది కంపు వాసనను భరించలేకపోతున్నారు. కరోనా సమయంలో మిగిలిన మధ్యాహ్న భోజన బియ్యం పురుగులు పడి అప్పటి నుండి ఇప్పటి వరకు వాటిని అలాగే ఉంచడంతో శిథిలావస్థకు చేరుకున్న ఎమ్మార్సీ భవనం అధిక వర్షాలకు లోపల కురవడంతో వాటితో పురుగులు పడి కంపు కొడుతున్నాయి. గతంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలు పలు సామాగ్రి బియ్యం, వంటకు ఉపయోగించే కర్రలు సైతం ఉండడంతో కార్యాలయంలా కాకుండా పెంటకుప్పల తయారైంది. దీనిపై సంబంధిత జిల్లా మండల అధికారులు స్పందించి కార్యాలయాన్ని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రతి రోజు పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు, పారిశుధ్యం పాటించాలి అని చెప్పుతు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా చేసుకుంటుంటారు. కాని అన్ని పాఠశాలల్లో పర్యవేక్షించి ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చే మండల విద్యాశాఖాధికారి కార్యాలయం కంపు కొడుతే బాగు చేసేదీ ఎవరిని పలువురు ప్రశ్నిస్తున్నారు.



# రుణంతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, హామీకి అనుగుణంగా రైతు రుణంతో సంబంధం లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బ్యాంక్ మహారాష్ట్ర ఎదుట రైతులతో కలిసి నిరసన తెలిపారు. ముందుగా బ్యాంక్ అధికారులతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రైతుల రుణమాఫీలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలోనే సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దాదాపు ఈ బ్యాంక్‌లో 1500 మంది రైతుల అకౌంట్లు ఉన్నాయన్నారు. ఇందులో కేవలం 280 మందికే రుణమాఫీ అయిందని, మిగితా వారికి కాలేదన్నారు. జాప్యం ఎక్కడ జరిగిందో అధికారులు, ప్రభుత్వం గుర్తించి రైతులకు భరోసా ఇచ్చేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం చేయడం సరికాదన్నారు. రుణమాఫీ రాని రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తులు ఇస్తున్న, వారికి రశీదులు ఇవ్వడం లేదన్నారు. దరఖాస్తు ఇచ్చిన ఎలాంటి ఆధారం కూడా రైతుల వద్ద ఉండటం లేదన్నారు. నాలుగు రోజుల్లో ప్రభుత్వం ఈ సమస్యకు పరిష్కారం చూపాలని లేని పక్షంలో రైతులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు ఉన్నారు.

# 'శిశువు మృతికి కోనప్ప నిర్లక్ష్యమే కారణం'

- మండిపడ్డ బీజేపీ నాయకులు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పెంచికల్‌పేట్ మండలం మేరగూడ గ్రామానికి చెందిన దుర్గం పంచపూల కడుపులోనే శిశువు మృతి చెందడానికి కారణం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్లక్ష్య వైఖరే కారణమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. స్థానిక ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పంచపూలను మంగళవారం బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి మాట్లాడుతూ మేరగూడ గ్రామానికి కక్షపూరితంగానే మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప రోడ్డు వేయించలేదని ఆరోపించారు. రోడ్డు సౌకర్యం సరిగా లేని కారణంగానే సకాలంలో ఆమె ఆస్పత్రికి చేరుకోలేక ఈ దారుణం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు అప్పట్లో చెప్పి బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీలో ఎమ్మెల్యేగా కొనసాగిన కోనప్ప ఈ గ్రామానికి ఎందుకు రోడ్డు వేయించలేదని ప్రశ్నించారు. ఇపుడు కూడా బీఆర్ఎస్‌ను కాదని మళ్లీ అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లిన కోనప్ప వెంటనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ గ్రామానికి రోడ్డు వేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు రాణి, చిప్ప మౌనిక, శరణ్య, పుష్ప, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, రూప, విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, కొప్పుల శంకర్, వలపదాసు రమేష్ పాల్గొన్నారు.

## రుణమాఫీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక అధికారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రుణమాఫీ ప్రక్రియ పూర్తిస్థాయిలో కాలేదని ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా రుణమాఫీ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఆయా మండలాల్లో అర్హులుగా ఉండి రుణమాఫీ కానీ రైతుల నుండి దరఖాస్తుల స్వీకరించేందుకు మండలాల వారీగా రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, జైనూర్, కెరమెరి, కాగజ్‌నగర్, దహెగాం, సిర్పూర్(టి) మండలాల్లో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వినతులు స్వీకరించనుండగా, సిర్పూర్ (యు), లింగాపూర్, కౌటాల, చింతలమానపల్లి, పెంచికలపేట, బెజ్జూర్ మండలాల్లో రైతు వేదికలలో వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

### మండలాల వారీగా ప్రత్యేక అధికారులు

| మండలం | అధికారి |
|---|---|
| ఆసిఫాబాద్ | మిలింద్(ఏఓ) |
| వాంకిడి | గోపికాంత్(ఏఓ) |
| తిర్యాణి | వినోద్ కుమార్(ఏఓ) |
| జైనూర్ | రాజేందర్(ఏఓ) |
| కెరమెరి | బి వెంకటి (ఏడీఏ) |
| కాగజ్‌నగర్ | రాధాకృష్ణ (ఏఓ) |
| సిర్పూర్(టి) | మధులత (ఏఓ) |
| దహెగాం | మనోహర్ (ఏడీఏ) |
| సిర్పూర్(యు) | ఆనందరావు(ఏఓ) |
| లింగాపూర్ | ఖలీల్ (ఏఓ) |
| కౌటాల | గణశ్యామ్(ఏఓ) |
| చింతలమానపెల్లి | శ్రీనివాస్(ఏఓ) |
| పెంచికలపేట | శ్రీవిద్య (ఏఓ) |
| బెజ్జూర్ | మారుతి(ఏఓ) |

## నూతన ఆర్ఓఆర్ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం చేపట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం-2024పై ప్రజాభిప్రాయ సేకరణ ముసాయిదా బిల్లుపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఈనెల 23లోగా సీసీఎల్.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో, ఈ -మెయిల్ ద్వారా అయితే ఆర్ఓఆర్2024-ఆర్ఈవీతెలంగాణ.జీఓవీ.ఇన్, పోస్ట్ ద్వారా సీసీఎల్ఏ కార్యాలయం, ల్యాండ్ లీగల్ సెల్, నాంపల్లి స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, అబిడ్స్, హైదరాబాద్-500001 పంపించవచ్చని, ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలోని నిపుణులు సదస్సుకు హాజరై తమ సూచనలు అందించాలని కోరారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ అంటూ మాయ మాటలు చెప్పి ప్రజలను ఇటు రైతులను మోసం చేసి గద్దెనెక్కిందని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఒక గ్రామాన్ని తీసుకొని ఎంతమంది రైతులకు రుణమాఫీ వర్తించిందో మేదవులతో వేదిక ఏర్పాటు చేసి రుణమాఫీపై చర్చకు సిద్ధ మేనా అని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సీఎం చిత్రపటానికి పాలభిషేకాలు కాదని, ముందుగా రైతుల రుణమాఫీ చేసి, పాలభిషేకాలు చేయాలని కోరారు. కేవలం కజ్జర్ల గ్రామంలోని రూ.2లక్షల రుణమాఫీ 80 మందికి రాలేదని ముందుగా రైతులకు సమాధానం చెప్పిన తర్వాతనే పాలభిషేకాలు చేయాలని సూచించారు. రైతులందరికి రుణమాఫీ వర్తిస్తే రైతులు రోడ్లపైకి వచ్చి ఎందుకు ఆందోళన చేస్తారని ప్రశ్నించారు. పోలీసులను ఉసిగొలిపి రైతులపై అక్రమ కేసులు బనాయిస్తారా అని అన్నారు. ఎలాంటి కేసులు పెట్టిన భయపడేది లేదని రైతుల కోసం ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా అన్నారు. రైతులు రుణమాఫీపై న్యాయంగా ధర్మంగా శాంతియుతంగా పోరాటాలు చేస్తే రుయ్యాడి గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడంపై మండిపడ్డారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీ పథకాలు ఎందుకు అమలు పర్చడం లేదన్నారు. రుయ్యాడి గ్రామస్తులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని అన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఆ పార్టీ నాయకులు ఆశన్న యాదవ్, గజానంద్, మహేష్, జనార్ధన్, ప్రకాష్, కిషన్, గంగాధర్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, రమాకాంత్, రంజిత్‌రెడ్డి, ఆసం రవి, మేకల రవికాంత్ పాల్గొన్నారు.

## ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-బోథ్

రుణమాఫీపై ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షలు మాఫీ చేయాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా వెంటనే రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేస్తానని రైతులను మోసగించిందన్నారు. రైతులు వ్యవసాయ పొలంలో ఉండే రైతులు రోడ్డెక్కే పరిస్థితి నెలకొందని, రైతులు ఆవేశంతో రోడ్లపై ధర్నాలు రాస్తారోకోలు చేయడం చాలా సిగ్గుచేటన్నారు. అనంతరం ధర్నా చౌక్ నుంచి బోథ్ తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ సుభాష్ చంద్రకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రైతు సంఘం అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీదర్‌రెడ్డి, సురేందర్ యాదవ్, పట్టణాధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్, దివాకర్‌రెడ్డి, రాజా రెడ్డి, కుడాల స్వామి, తుల హరీష్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నిర్మల్

రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, పెండింగ్ ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, కొత్త రెవెన్యూ చట్టం వంటి అంశాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రానున్న 5 రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాల వారీగా నమోదైన వర్షపాతం గురించి కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల వలన పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు, విద్యాసంస్థలకు ఎలాంటి సమస్యలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రాజెక్టులు, నది పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎలాంటి నష్టం వాటిల్లకుండా అత్యవసర బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాల వారీగా పెండింగ్‌లో ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను తిరస్కరించినట్లైతే కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బంది ద్వారా ప్రత్యేక బృందాలను నియమించాలని, దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, వేగవంతంగా పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నూతన రెవెన్యూ యాక్ట్‌పై జిల్లా స్థాయిలలో మేధావులు, సీనియర్ సిటిజన్స్, సీనియర్ అధికారులతో వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేసి అభిప్రాయాలు సేకరించాలని సూచించారు.

## కారు టైరు పేలి ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని రోల్‌మామడ వద్ద కారు టైరు పేలి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని రోల్‌మామడ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కారు సిద్దిపేట నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఎన్‌హెచ్ 44 రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. కారులో నలుగురు ప్రయాణికులు ఉండగా ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు.



## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

నవతెలంగాణ-లోకేశ్వరం

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు మ్యాదరి ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ఎస్సీ వర్గీకరణ మాకొద్దు అంటూ మండలంలోని వివిధ గ్రామాల ఎస్సీ సంఘం సభ్యులు శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ ఆర్కా మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు మోడం శంకర్, అంబకంటి శ్రీనివాస్, దిగంబర్, అర్ల నరేష్, వివిధ గ్రామాల ఎస్సీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



# రుణమాఫీ పేరుతో రైతులకు మోసం



నవతెలంగాణ-సిరికొండ

రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు ఓరగంటి పెంటన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పూర్తి స్థాయిలో మాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తోందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్క రైతుకి రుణమాఫీ చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు గొర్ల రాజన్న, కదం సూర్య కాంత్, చందు, బాలాజీ, రోహిదాస్, సునీల్, మారుతి, లతీఫ్, విఠల్, విజయ్ పాల్గొన్నారు.

**లోకేశ్వరం :** పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని రాయపూర్ కాండ్లి గ్రామ రైతులు ధర్నాకు దిగారు. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేసినప్పటికీ అర్హులైన తమకు రుణమాఫీ కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి బేషరతుగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్, వ్యవసాయశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

**కుభీర్ :** మండలంలోని మలేగాం గ్రామంలో గ్రామ రైతులు మలేగాం, బైంసా వెళ్లే రహదారిపై మంగళవారం రైతులు ఆందోళన రాస్తా రోకో చేపట్టారు. గ్రామంలో ఉన్న రైతులు అందరూ కలిసి కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీని చేయాలంటూ గ్రామ రైతులు ఆందోళన చేశారు. దీంతో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మా గ్రామంలో అధిక సంఖ్యలో రైతులు ఉన్నప్పటికీ కేవలం కొందరు రైతులకు మాత్రమే రుణమాఫీ కావడంతో మిగిలిన రైతులకు రుణమాఫీ కాలేదని వాపోయారు. దీంతో మూడు విడతలుగా రుణమాఫీ చేసి కొందరికి మాత్రమే రుణమాఫీ అయినప్పటికీ ప్రభుత్వం మాత్రమే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రకటనలు చేపట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో రూ.2లక్షలలోపు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ కాలేదని అన్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉన్న అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రూ.2లక్షల రుణమాఫీ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని, రైతులు డిమాండ్ చేశారు. లేని యెడల అన్ని గ్రామాల రైతులు ప్రభుత్వానికి నిలదీసేలా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. దీంతో రాస్తా రోకోతో కొద్దిసేపు వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి.







# దేశానికి రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



నవతెలంగాణ-నిర్మల్

మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు నివాసంలో రాజీవ్ గాంధీ 80వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికింది రాజీవ్‌గాంధీనేనని అన్నారు. 18 ఏండ్లకే యువకులకు ఓటు హక్కును కల్పించారని తెలిపారు. దేశ యువతకి రాజీవ్‌గాంధీ స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు నాందెడపు చిన్ను, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఎంబడి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో మంగళవారం ఘనంగా రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం మాట్లాడుతూ భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణాధ్యక్షులు నిమ్మల రమేష్, జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, మహిళా నాయకురాలు భవానీ, నాయకులు సలీం ఖాన్, రాజేశ్వర్ చౌకత్ బాషా, లండెరి రమేష్, మిర్జా, రమేష్, జహీర్, ఖానాపూర్ పట్టణ, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్ :** భారతదేశానికి సాంకేతిక పరిజ్ఞానానికి నాంది పలికి, అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ 80వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోకి కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో రాజీవ్‌గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దేశ ప్రజలు అనుభవిస్తున్న సాంకేతికకు రాజీవ్‌గాంధీ ఆద్యుడని ఆయన పాలనలో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారని అన్నారు. అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు, యువతకు స్ఫూర్తి ప్రధాత ఆయన చూపిన మార్గంలో యువత పయనించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మావల మండల మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు రహీంఖాన్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, మావల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, పార్టీ సినియర్ నాయకులు నలిమేల నవీన్‌రెడ్డి, కునింటి దామోదర్‌రెడ్డి, కొరటి ప్రభాకర్, షాహిద్, రంజిత్‌రెడ్డి, సంటెన్న పాల్గొన్నారు.

**ఉట్నూర్ :** నేటి యువత రాజీవ్‌గాంధీ అడుగు జాడల్లో నడవాలని జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ జావీద్ అన్నారు. మంగళవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలో కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ మాజీ బ్లాక్ అధ్యక్షుడు మదన్‌రావు, అశోక్, నాయకులు జావిద్, కిరణ్, విష్ణు, దస్తగిరి, సోయం చందు, అఖిల్, జుబేర్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటుంబమని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీతో పాటు 18 ఏండ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రధాన మంత్రిగా గ్రామీణ ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించారని తెలిపారు. నెహ్రూ నుంచి రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. రాజీవ్‌గాంధీ ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, గిమ్మ సంతోష్, శ్రీలేఖ పాల్గొన్నారు.










## పదవుల కోసమే రైతులపై బీఆర్ఎస్ కపటప్రేమ

నవతెలంగాణ-తాంసి

వచ్చే లోకల్‌బాడీ ఎన్నికల్లో పదవులు పొందాలని ఆశతోని రైతులపై బీఆర్ఎస్ నాయకులు కపట ప్రేమ చూపిస్తున్నారని వారిని నమ్మి రైతులు మోసపోవద్దని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. మంగళవారం భీంపూర్ మండలం కేంద్రంలో మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రైతు రుణమాఫీ చేయడం చేతకాని, బీఆర్ఎస్‌కు రుణమాఫీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఒక కుటుంబంలో రెండు, మూడు బ్యాంకు రుణ ఖాతాలు ఉండటం కారణంగా కుటుంబానికి అయ్యే రుణమాఫీలో కొంత జాప్యం జరుగుతుందని అన్నారు. కానీ ఆ సాకుని పట్టుకొని బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీ కాదనే విధంగా రైతులను రెచ్చగొడుతున్నారని అలాంటి నాయకులను రైతులు నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేయాలని ధృఢ సంకల్పంతో ప్రతి మండలానికి నోడల్ అధికార్లతో పాటు వ్యవసాయ అధికారులను ప్రతి ఇంటింటికి వెళ్లి రుణమాఫీపై సర్వే చేయడం జరుగుతుందని అన్నారు. బోథ్ ఎమ్మెల్యేగా గెలిచి ఇన్ని రోజులు అవుతున్న ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టలేదన్నారు. కానీ కేటీఆర్ దగ్గర మెప్పు పొందాలనే ఉద్యేశంతో రుయ్యాడి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులను రైతులను రెచ్చ గొట్టి ముఖ్యమంత్రి శవయాత్ర చేపట్టడం హేమమైన చర్య అని అన్నారు. ఏక్కడ కూడా రైతులు ధర్నాలలో పాల్గొనడం లేరు కేవలం వచ్చే లోకల్ బాడీ ఎన్నికలలో పదవులు పొందాలని అత్యాశతోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే విధంగా రైతులను రెచ్చగొడుతున్నారని అన్నారు. రైతులు బీఆర్ఎస్ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మంచి కోరే ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆన్ను పటేల్, రమేష్, సుదర్శన్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## డెంగ్యూ కేసులు నియంత్రించేందుకు చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీలో డెంగ్యూ కేసులను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌ఓ కృష్ణ అన్నారు. అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం తొలి రోజు వార్డు నెంబర్ పది పరిధిలోని రాంనగర్ కాలనీలో వ్యాధులపై అవగాహన కల్పించారు. కాలనీలోని మురుగు కాలువలను శుభ్రం చేయించారు. అనంతరం స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ మాట్లాడుతూ ఆదిలాబాద్ మున్సిపాలిటీలో డెంగ్యూ కేసుల నియంత్రణ కోసం మున్సిపల్, మెప్మా ఆరోగ్య సిబ్బందితో కలిసి అర్బన్ డెంగ్యూ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. 49 వార్డుల పరిధిలో బృందాలు పర్యటిస్తు డ్రై డే నిర్వహిస్తారన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరిస్తారని పేర్కొన్నారు. యాంటి లార్వా, స్ప్రేయింగ్ చేస్తారని తెలిపారు. ప్రజలు కూడా వారి ఆరోగ్య పరిరక్షణకు నీరు నిల్వ లేకుండా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియాధికారి శ్రీధర్, వైద్యారోగ్య, మెప్మా మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలను బాధ్యతతో పాఠశాలకు పంపాలి



నవతెలంగాణ-నార్నూర్

పిల్లలను సక్రమంగా బాధ్యతతో పాఠశాలకు పంపాలని, న్యూ రెయిన్‌బో స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కొమ్ము రాములు అన్నారు. మంగళవారం మండలంలోని మహాగావ్ గ్రామపంచాయతీలోని గోండు గూడాలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బేటి బచావో, బేటి పడావోలో భాగంగా తల్లిదండ్రులు బాధ్యతతో పిల్లలను పనుల్లో ఉంచకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. అలాగే వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు రవితేజ, మల్కు పటేల్, చిత్రు, తులసిరాం, తులజా బాయి, మహేశ్వరీ ఉన్నారు.

## వరదలతో అతలాకుతలమైన వయనాడ్

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వరదల కారణంగా కేరళలోని వయనాడ్ అతలాకుతలం అయిందని, వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. మంగళవారం వయనాడ్ బాధితుల కోసం విరాళాలను సేకరించారు. నేతాజీ చౌక్‌లోని దుకాణాలు తిరుగుతూ విరాళాలను తీసుకున్నారు. బాధితులకు అండగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ వరదల కారణంగా వయనాడ్‌లో వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వారికి ఆర్థిక సాయం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్యేశంతో సంఘం పిలుపు మేరకు విరాళాలను సేకరిస్తున్నామన్నారు. మానవతావాదులు ముందుకు వచ్చిన వయనాడ్ ప్రజలకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యమందించాలని, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దాదిరావ్ అన్నారు. మంగళవారం జైనూర్ పీహెచ్‌సీ నుంచి మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి బదిలీపై వచ్చిన డాక్టర్ జితేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జాదవ్ సచిన్, విజయ్ ఉన్నారు.

## 25న సమీక్షా సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందీ భాష సేవా సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 14న జరిగే హిందీ దినోత్సవ వేడుకలు ఏర్పాట్లకు సమీక్షా సమావేశాన్ని ఆగస్టు 25న నిర్వహిస్తున్నట్టు హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పేట్కులే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలోని పూలే విశ్రాంతి భవనంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పదోన్నతి పొందిన హిందీ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు హిందీ భాష సేవాసమితి కార్యవర్గ సభ్యులు, హిందీ పండితులు సకాలంలో సమావేశానికి హాజరై కార్యక్రమ విజయానికి సహకారం అందించాలని కోరారు.

# నవతెలంగాణ

## కుమురంభీం ఆసిఫాబాద్

బుధవారం | 21 ఆగస్టు, 2024 | www.navatelangana.com




## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని కొండపెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన నిశా జోహ్రి, గజేంద్ర కుమార్ జోహ్రి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వాహకుడు అమీద్ జోహ్రి పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్కులు అందజేశారు. ట్రస్టు వాలంటరీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సామాజిక సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ట్రస్టు ద్వారా విద్యార్థులకు బ్యాగులను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వాలంటరీలు కొయ్యాడ రాజాగౌడ్, గడ్డం రేణుక, ఉపాధ్యాయులు అశోక్, తిరుమల గౌడ్, ప్రశాంత్, మాజీ సర్పంచ్ సంజీవ్ పాల్గొన్నారు.

## రోడ్లను సందర్శించిన డీఎల్‌పీఓ

నవతెలంగాణ-దహెగాం



ఈ నెల 17న మండలంలోని యువత రోడ్ల పరిస్థితిపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కలెక్టర్ అదేశాల మేరకు డీఎల్‌పీఓ ఒమర్ హుసేన్ మండల కేంద్రంలోని పలు రోడ్లను సందర్శిచారు. రోడ్లకు సంబంధించిన ఎస్టిమేషన్ తెప్పించుకొని సంబంధిత అధికారులకు కలెక్టర్ ద్వారా పంపించి సమస్యలను పరిష్కరిస్తామని గ్రామ యువతకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ యువత స్వచ్ఛందంగా రోడ్డుపై కంకర వేస్తున్న విషయాన్ని తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ పాల్గొన్నారు.

# తండాల్లో మొదలైన తీజ్ సందడి

- తండాల్లో మొదలైన తీజ్ సందడి
- తొమ్మిది రోజుల పాటు వేడుకలు
- నియమ నిష్టలతో పూజలు
- లంబాడీల సాంస్కృతికి ప్రతీక





నవతెలంగాణ-కెరమెరి

సంప్రదాయానికి ప్రతీకగా గిరిజనులు తీజ్ పండుగను జరుపుకొంటారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో భక్తి పారవశ్యంతో ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. తెలంగాణ ప్రాంతంలోని గిరిజన తండాల్లో యువతీ యువకులు ఆటాపాటలతో తొమ్మిదిరోజుల పాటు ఉత్సవాల్లో సందడి చేస్తారు. వందల ఏండ్ల నుంచి వస్తున్న ఆచార, సంప్రదాయాలు, సాంస్కృతిని కాపాడుకుంటున్న గిరిజనులు తీజ్‌ను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన తండాల్లో తీజ్ సందడి మొదలైంది. శ్రావణ మాసంలో మొదలయ్యే తీజ్ పండుగను సేవాలాల్ ఆలయం వద్ద రెండు మట్టి ప్రతిమలను ప్రతిష్ఠించి సంప్రదాయ పాటలు పాడుతూ వేడుక ప్రారంభిస్తారు. ఈ పండుగలో పెళ్లికాని యువతులు తమకు మంచి వరుడు దొరకాలని తొమ్మిది రోజుల పాటు కొత్త బుట్టల్లో గోధుమ, శనగ గింజలు చల్లి వాటిని పూజించడం పండుగ ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తూ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మొలకలకు నీరు పోస్తూ యువతులు, మహిళలు వేడుక నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల తర్వాత మొలకెత్తిన వెదురుబుట్టలతో తండానాయక్ ఇంటి వద్దకు చేరుతారు. మొలకెత్తిన నారుకు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయడంతో వేడుక ముగుస్తుంది. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తెచ్చుకున్న పిండి వంటకాలను ఒకరికొకరు ఇచ్చుకుని అనురాగం, అప్యాయత పంచుకోవడం లంబాడా గిరిజనుల ప్రత్యేకత.

**నియమనిష్టలతో పూజలు**

తీజ్ వేడుకలను ప్రతి ఒక్కరూ నియమనిష్ఠలతో జరుపుకొంటారు. కొత్త బుట్టల్లో గింజలు వేసి యువతులు పూజలు చేస్తారు. పూజించకపోతే గింజలు మొలకెత్తవని వారి నమ్మకం. తొమ్మిది రోజుల పాటు ఒక పూట భోజనం చేయాలి. భోజనంలో తోటకూరను ఉప్పుకారం లేకుండా తీసుకోవాలి. ఇలా నియమ నిష్ఠలతో పూజిస్తే కోరికలు నెరవేరుతాయని పెద్దల ప్రగాఢ విశ్వాసం.

**ఆడబిడ్డలదే అగ్రస్థానం**

తీజ్ ఉత్సవాల్లో ఆడబిడ్డలదే అగ్రస్థానం. వేడుక మొదలైన రోజు నుంచి సుదూర ప్రాంతాల్లో ఉన్న అక్కాచెల్లెళ్లను అన్నదమ్ములు పుట్టింటికి తీసుకొస్తారు. వీరికి తొమ్మిది రోజుల పాటు అతిథి మర్యాదలు చేస్తారు. చివరి రోజు వీరి కాళ్లు కడిగి నీళ్లు చల్లుకొని పూజలు నిర్వహిస్తారు. ఆడబిడ్డల ఆశీర్వాదం ఉంటే పాడి పశువులతో పాటు పంటలు సమృద్ధిగా లభిస్తాయని విశ్వాసం. ఆషాఢ మాసంలో పశువులకు సోకే వ్యాధుల బారి నుంచి జగదాంబ దేవి కాపాడుతుందని నమ్ముతారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని ప్రాచుర్యం ఉంది.

**పులియోగెనో..**

ఉత్సవాల్లో ముఖ్యమైనది పులియోగెనో. బంజారా మహిళలు స్వయంగా అద్దాలు, గవ్వలు, పూసలతో తయారు చేస్తారు. గోధుమలు మొలకెత్తడానికి పవిత్ర జలాలు పోసే సమయంలో వీటిని వినియోగిస్తారు. యువతులు కలశాల్లో జలాలు తీసుకొచ్చేటపుడు తలపై పెట్టుకునే దానిని గెనో అని, రెండు కలశాలపై కప్పుకొని వచ్చే దానిని పులియా అన్ని వ్యవహరిస్తారు. పెళ్లి సమయంలో పెళ్లికూతురుకు తమ గుర్తుగా తల్లిదండ్రులు అందిస్తారు.



### ఉత్సవాలు మధురఘట్టం

**దివ్య, యువతి, దేవపూర్**

మొలకల పండుగ తీజ్. గిరిజన యువతులందరికీ ఇష్టమైన పండుగ. నిష్ఠతో ఉండి తొమ్మిది రోజులు పూజలు చేస్తాం. పెద్దల ఆశీర్వాదాలు మాకు మంచి జీవితాలు ఇస్తాయి. ఈ ఉత్సవాలు జీవితంలో ఒక మధురఘట్టంగా నిలుస్తాయి.

### తీజ్ పండగను వైభవంగా జరుపుకంటాం



**జ్యోతి, అనార్‌పల్లి గ్రామం**

తరతరాలుగా వస్తున్న సాంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తాం. తీజ్ పండగ వచ్చిందంటే తండాల్లో సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు తీజ్ వద్దకు వెళ్లి ఆటపాటలతో నృత్యాలు చేయడం అనవాయితీ. చిన్న పిల్లలతో పాటు, మహిళలంతా కలిసి తీజ్ సంబరాలను ఉల్లాసంగా జరుపుకుంటాం.

### తొమ్మిది రోజులు ఉపవాస దీక్షలు



**సున్నాబాయి, కెరమెరి**

తీజ్ పండుగ రోజుల్లో తొమ్మిది రోజుల పాటు ఉపవాసం ఉంటాం. రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటాం. దీక్ష పూర్తయితే అంతా మంచి జరుగుతుంది. భావి జీవితం బాగుంటుందనే నమ్మకం.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలనెల సక్రంగా వేతనాలు చెల్లించాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షరీఫ్ అన్నారు. ఈనెల 17న సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న ఉద్యోగి వసీం 3 నెలలుగా జీతాలు రాక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. అలాంటి పరిస్థితిలో జిల్లాలో రాకుండా అధికారులు వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాని కోరుతూ సిర్పూర్ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు. ఉద్యోగి ఆత్మహత్యను నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు ఏజెన్సీల వారు తొలగిస్తున్నారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఇజార్ హుస్సేన్, కార్యదర్శి సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని వెల్గీ గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల వల్ల వచ్చే వ్యాధులు, చేతులు శుభ్రపరిచే పద్ధతుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు పరీక్షించి మందులు పంపిణీ చేశామని వైద్యశాఖ అధికారి రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సిలింగ్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 22న స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో ఉన్న ఐదు గురుకుల కళాశాలలో సీట్లను ఈనెల 22న స్పాట్ కౌన్సిలింగ్ సిర్పూర్(టి) బాలుర కళాశాలలో ఉదయం 9 గంటలకు ఉంటుందని, ఈ కౌన్సిలింగ్ ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. సీట్లు ఖాళీగా ఉన్న కళాశాల వివరాలు ఆసిఫాబాద్ బాలుర కళాశాలలో ఎంపీసీలో 8, ఎస్సీ అభ్యర్థులకు 3, ఎంసీసీ అభ్యర్థులకు 1, ఎస్టీ అభ్యర్థులు 2, ఓసీ అభ్యర్థులు 1, మైనారిటీ 1, సిర్పూర్ బాలుర కళాశాలలో 29. ఎస్సి 23, ఎంసీసీ 1, ఎస్టీ 3, మైనారిటీ 1, సీఈసీలో 5 ఎస్సీ3, బీసీ 2. సిర్పూర్ బాలికల గురుకుల కళాశాల సీఈసీ 5, ఎస్సీ 2, మైనార్టీ 1, ఎస్టీ 1, ఎంసీసీ 1. హెచ్ఈసీ 26 సీట్లు. ఎస్సి 22, మైనార్టీ 1, ఎస్టీ 2, ఎంసీసీ 1. కాగజ్ నగర్ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ 14 సీట్లు. ఎస్సి 9, ఎస్టీ 1, బీసీ 1, మైనార్టీ 1, ఓసీ 1, ఎంసీసీ 1. రెబ్బెన బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీలో 11 సీట్లు ఎస్సీ 6, ఎస్టీ 1, బీసీ 1, ఓసీ 1, మైనార్టీ 1, ఎంసీసీ 1. బైపీసీలో 3 సీట్లు ఎస్టీ 1, ఓసీ1, మైనార్టీ 1 ఖాళీలున్నట్లు ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌తో పాటు రెండు జిరాక్స్ సెట్లతో కౌన్సెలింగ్‌కు సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షా శిబిరానికి స్పందన లభించింది. శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 33 మంది కంటి పరీక్షలు చేసుకోగా ఏడుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత దంపతులు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు రతన్‌గైన్, కోశాధికారి రవివర్మ, అష్టమాలజిస్టులు వసీ, గోపి పాల్గొన్నారు.

## ఎన్ఎంఎస్ఎస్ పరీక్షకు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ అర్హత కోసం నిర్వహించే పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 9లోపు దరఖాస్తు చేసుకోవాలని దీనికోసం బీఎస్ఈ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నవంబరు 24న పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

నవతెలంగాణ-వాంకిడి

మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ పడడంతో నీరు వృథాగా పోతుంది. మండల కేంద్రంలోని నేషనల్ హైవేపై ఉన్న మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ పడడంతో మంగళవారం ఉదయం నుండి నీరు వృథాగా పోతుంది. అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వైపుకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మత్తులు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



## నేటి నాయకులకు రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడు

- ఘనంగా రాజీవ్ గాంధీ 80వ జయంతి
- రెండు గ్రూపులుగా ఏర్పడి వేడుకలు



ఆసిఫాబాద్ : రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

నవ తెలంగాణ-ఆసిఫాబాద్

నేడు ఉన్న రాజకీయ నాయకులకు రాజీవ్ గాంధీ ఆదర్శప్రాయుడని విలువలకు కట్టుబడిన మహోన్నత వ్యక్తి అని కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ ఇంటి వద్ద ఆయన వర్గీయులు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ ఇంటి వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో విలువలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నేటి నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగితే రాజకీయాల్లో ఉన్నతంగా రాణించగలరని అన్నారు. మన దేశంలో అతిచిన్న వయస్సులో ప్రధాన మంత్రి పదవీని చేపట్టిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కిందనీ కొనియాడారు. ఏది ఏమైనా జయంతి వేడుకల సందర్భంగా మరోసారి గ్రూప్ రాజకీయాలు బయటపడ్డాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, నాయకులు నిజాం, శంకర్, మల్లికార్జున్, జక్కయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ :** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ వార్ల తిరుపతి, నాయకులు ఫైసల్ బిల్ సులేమాన్, ఎమ్మాజి సంతోష్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : రాజీవ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

## సీనియర్ సిటిజన్లకు అందని ఆరోగ్య సేవలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీనియర్ సిటిజన్లకు మెరుగైన వైద్యసేవలందించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు నీరు గారిపోతున్నాయని, వారికి సరైన విధంగా వైద్యం అందడం లేదని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు ఎఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, సిహెచ్ రామయ్య, బి సుదర్శన్, మార్త ఉపేందర్, పి.దేవయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంచార వాహనాల ద్వారా సీనియర్ సిటిజన్ల ఇళ్ల వద్దకే వచ్చి వైద్య సేవలందించాల్సి ఉందని, కాని ఇది అమలు కావడం లేదన్నారు. నడవలేని, లేవలేని వారు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వృద్ధుల సంఖ్య అధికంగా ఉన్నందున వెంటనే అధికారులు చొరవ తీసుకొని వారిళ్ల వద్దే వైద్యసేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## సీసీ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి

**వాంకిడి :** మండలంలోని కిరిడి గ్రామానికి రోడ్డుతో పాటు ఒర్రెపై వంతెన లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని మండలంలోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దృష్టికి తీసుకెళ్లిన నేటి కూడా అదే పరిస్థితి ఉందని గ్రామ ప్రజలు అంటున్నారు. అనేకసార్లు రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నారు. ఇప్పటికైనా గ్రామానికి రోడ్డుతో పాటు ఒర్రెపై వంతెన నిర్మించాలని కోరారు.

## పంటల సాగుపై అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వరి, పత్తి పంట సాగు యాజమాన్యంపై వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు రుణమాఫీకి సంబంధించిన సందేహాలకు ఏఈఓలు శ్రీవిద్య, లావణ్య పలు సూచనలు చేశారు. రైతులు పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

## ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి



నవతెలంగాణ-తిర్యాణి

మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకలను స్థానిక శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాటి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ ప్రాంతాన్ని ఏలిన రాజుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. బహుజనులను రాజ్యాధికారం వైపు తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాపన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్, మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మగోని శంకర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు రంగా గౌడ్, మోకు దెబ్బ మండల అధ్యక్షులు జుంగోని అశోక్ గౌడ్, నాయకులు పెరుమండ్ల వెంకటేశం గౌడ్, బొమ్మ గోని బుచ్చ గౌడ్, సారా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన నోడల్ అధికారి

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని పాఠశాలలను మండల నోడల్ అధికారి గావుడే హనుమంతు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలోని శిరీష ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో రాయించడం చదివించడం ప్రతిరోజు చేయాలని సూచించారు. విద్యార్థుల పట్ల అశ్రద్ధ చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించాడు. ఆయన వెంట సీఆర్పీ ప్రకాష్ ఉన్నారు.



## ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, గ్రామ పంచాయితీ సాధారణ ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీల వారిగా ఓటర్ల జాబితా మెర్జింగ్ స్టేట్మెంట్ తొందరగా తయారు చేసి టీ పోల్ ఎంట్రీ చేయడానికి రెడీగా ఉండాలని సూచించారు. పారిశుధ్య పనులు నిరంతరంగా చేయాలని, క్లోరినేషన్ చేయాలని వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ ఆకుల లక్ష్మీ నారాయణ, ఏపీఓ నవీన కుమార్, ఈసీ మల్లేష్ పాల్గొన్నారు.

## జాగ్రత్తలు పాటిస్తే జ్వరాలు దూరం



నవతెలంగాణ-జైపూర్

వర్షాకాలంలో జ్వరాలు రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సూచించారు. భీమారం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంగళవారం ఇల్లిల్లు తిరుగుతూ జ్వరాలు వస్తున్న వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రధానంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వారంలో ఒక రోజు నీటి పాత్రలను ఆరబెట్టుకోవాలని సూచించారు. వేడి ఆహారం తీసుకోవడంతో పాటు సురక్షితమైన నీరు తాగాలని తెలిపారు. అస్వస్థతకు గురైనపుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ రజిత, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన సాగాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన కొనసాగాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. భీమారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం అకస్మికంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, తరగతి గదులు పరిశీలించిన కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, కనీస మౌళిక సదుపాయాలు కలిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. తరగతి గదుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వార్షిక ఫలితాలలో ఉత్తీర్ణత శాతం పెరగాలని అన్నారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కాగా ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-మందమర్రి

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెక్కులు అందచేశారు. మంగళవారం సీఈఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ 136 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన వెంటనే నెరవేర్చామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల రుణమాఫీ చేశామని రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. మందమర్రి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. డ్రైనేజ్ సమస్యలు ఉన్నాయని దృష్టికి రావడంతో రూ.రెండు కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. రోడ్ల అభివృద్ధికి రూ.80 లక్షలతో పనులు ప్రారంభించిన్నట్లు, అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందేలా కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి సమస్య ఉండకూడదని, నిధులు అవసరం ఉంటే వెంటనే కేటాయిస్తానని మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. అనంతరం మున్సిపాలిటీకి సంబందించిన 2 నూతన ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు బండి సదానందం, గుడ్ల రమేష్, దుర్గం నరేష్, మంద తిరుమల్ పాల్గొన్నారు.

## సమాజ సేవలో డాక్టరేట్ పొందడం అభినందనీయం

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లా వయోజన విద్యాశాఖ పరిధిలోని డీఆర్‌పీ రెడ్డిమల్ల ప్రకాశం సమాజ సేవలో డాక్టరేట్ పొందడం అభినందనీయమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సమాజ సేవలో నిమగ్నమై, సమాజ హితం కోరుతూ అందించిన సేవలకు గాను మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు సంస్థ ద్వారా దేశ రాజధాని ఢిల్లీలో డాక్టరేట్ పొందిన రెడ్డిమల్ల ప్రకాష్‌ను కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5 దశాబ్దాలుగా సమాజ హితం కోసం న్యాయవాద వృత్తిని చేపట్టి, వయోజన విద్యలో విశిష్ట సేవలు అందించి డాక్టరేట్ పొందడం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి, జిల్లా యువజన, క్రీడాధికారి కీర్తి రాజీరు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, సఖి లయన్స్ అధ్యక్షుడు బండ శాంకరి, డీఆర్పీ పోకల వెంకటేశ్వర్లు, సమన్వయకర్తలు గుండా సంధ్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## వృద్ధుల ఆరోగ్యం కాపాడేందుకే వైద్య శిబిరం

నవతెలంగాణ-జన్నారం

వృద్ధుల ఆరోగ్య పరిస్తితులు కాపాడేందుకే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఆయుష్ వైద్యశాఖ మంచిర్యాల డీపీఎం రవీందర్ అన్నారు. మంగళవారం జన్నారంలోని పోన్కల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి. నీరజ, సిబ్బంది భాగ్యలక్ష్మి, శ్రీధర్, ముజాఫర్ పాల్గొన్నారు.

# ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలి




నవతెలంగాణ-తాండూర్

మధ్యాహ్నం భోజనం ప్రాజెక్టును హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే ప్రతిపాదనను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం కోరారు. మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు, వేతనాల పెంపు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులు వంట బందు పెట్టి హైదరాబాద్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నామని తెలిపారదు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటు సంస్థలకు అప్పగించే యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 54,201 మంది 25 వేల పాఠశాలల్లో, 24 లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం పెడుతున్నారని వీరంతా పరోక్షంగా మధ్యాహ్న భోజన కార్మికులుగా ప్రభుత్వంపై ఆధారపడ్డారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులు గత 24 సంవత్సరాలుగా అనేక కష్ట, నష్టాలను ఓర్చి పనిచేస్తున్నారని, పనిచేసే వారిలో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు ఉన్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఉపాధిని పరిగణలోకి తీసుకోకుండా మొత్తం పథక నిర్వహణను హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, ఇందారపు తార, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-జన్నారం

తమకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కవ్వాల్, బంగారు తాండా కామన్పల్లి దేవుని గూడా సోనాపూర్ తండా, గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చేశారు. మంగళవారం వారు జన్నారంలోని కవ్వాల్ చౌరస్తా వద్ద ఉన్న ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు భూక్య సదా సింగ్, రాథోడ్ తిరుపతి, పంచారపుల సురేష్, సుంచు సోనియా రావులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీ తమకు రాలేదని, దీంతో తాము నష్టపోయే ప్రమాదం ఉందని వారు వాపోయారు. తమకు వెంటనే రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాస్తారోకో చేస్తున్న సమయంలో రోడ్డుకి ఇరువైపులా భారీ వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి రైతులకు నచ్చ చెప్పారు. అయినా రైతులు ససేమిరా అనడంతో మండల వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి సమాధానం చెప్పాలని భీష్మించుకు కూర్చున్నారు. పోలీసులు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నచ్చజెప్పడం రైతులు రాస్తారోకో విరమించారు కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమాన్ని విస్మరిస్తున్న యాజమాన్యం : ఐఎన్టీయూసీ



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్‌రావు అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పి-1 గనిని సందర్శించారు. గనిలోని కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ గనిలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. అధికారులకు ఉత్పత్తి మీద ఉన్న ఆరాటం కార్మికుల ఆరోగ్యం పట్ల, సంక్షేమం పట్ల లేదని అన్నారు. ఇకనైనా గనిలో కార్మికులు రెస్ట్ తీసుకొనే రెస్ట్ హాల్ శుభ్రంగా ఉంచాలని, కార్మికుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి క్యాంటిన్‌లో పౌష్టిక ఆహారాన్ని అందిస్తూ క్యాంటీన్‌ని శుభ్రంగా ఉంచాలని, అలాగే కార్మికుల యొక్క వస్తువులను బట్టలను పెట్టుకొనే పెట్టెలను లాకర్లను



ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు రావాల్సిన లాభాల బాట తొందరలో పరిష్కారం అయ్యే విధంగా ఇటు యాజమాన్యంతో అటు ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామని, అలాగే ఇన్కమ్ టాక్స్ రిఫండ్ కార్మికులకు చెల్లించే విధంగా యాజమాన్యంతో ఇప్పటికే అనేకమార్లు చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గరిగే స్వామి, కేంద్ర నాయకులు తిరుపతి రాజు, బ్రాంచ్ నాయకులు నీలం సదయ్య, మహేందర్‌రెడ్డి, తిరుపతి, ఏరియా సెక్రెటరీ రావుల అనిల్, పిట్ సెక్రెటరీ మద్దెల వెంకటేష్, నాయకులు నారాయణస్వామి, తిరుపతిరావు, బాలాజీ పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారం కృషి చేస్తాం**

తమ దృష్టికి వచ్చిన కార్మికుల సమస్యలు యాజమాన్యంతో మాట్లాడి సత్తరమే పరిష్కారమయ్యేలా చూస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా అన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిని సందర్శించి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రేడ్స్ మెన్స్ మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు ముఖ్యంగా ట్రీట్మెంట్స్, ఫీట్ అయితే సూటబుల్ జాబ్ ఇవ్వాలని, క్యాడర్ స్కీమ్ పరిష్కారం చేయాలని మా దృష్టికి తీసుకువచ్చారని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, కార్యదర్శి బీర రవీందర్, సహాయ కార్యదర్శి ప్రతాప్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

# మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ స్కూలు, కాలేజీలో విద్యార్థులకు సిబ్బందికి, మహిళలు పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై మంచిర్యాల జిల్లా షీ టీం ఇన్‌చార్జి ఎస్ఐ హైమ అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్, పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళలు, పిల్లల రక్షణ భద్రత, షీ టీమ్స్, భరోసా సెంటర్ పనిచేస్తున్నాయని తెలిపారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ టి సేఫ్ అప్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలు, మహిళలను ఇబ్బందులకు గురి చేసే వారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. షీ టీమ్ అవగాహనా కార్యక్రమాల ద్వారా స్కూలు కాలేజీ విద్యార్థులకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 కాల్ చేయాలని, స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లైంగికంగా వేధించటం, వెంటపడటము ఇటువంటి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లైంగిక వేధిస్తే ఎవరైనా భయపడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కొత్త వారిని గుడ్డిగా నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక దురాచారాల నిర్మూలన, కుటుంబ అనుబంధాలు, సైబర్ నేరాలపై, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 1930, టీ-సేఫ్ అప్లికేషన్ అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలను ఎవరైనా వేధిస్తే రామగుండం షి టీమ్ 6303923700 నెంబర్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మహిళల గురించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట పోలీస్‌స్టేషన్ సిబ్బంది, షి టీమ్ సిబ్బంది భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ విజయ, సిబ్బంది వైస్ ప్రిన్సిపాల్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

నవతెలంగాణ-జన్నారం

నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శిల సంఘ నాయకులను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న అభివృద్ధి పనులే ఇటీవల జిల్లాలోనే ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రశంసా పత్రాన్ని అందుకున్న లకావత్ శ్రీనివాస్ నిదర్శనం అని తెలిపారు. ఇదే స్ఫూర్తిగా పనిచేసి మరింత ప్రజలకు సేవలను అందించడంలో కార్యదర్శులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు లకవత్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చేటుపల్లి మధు, కోశాధికారి విశ్వశ్రీ జాయింట్ సెక్రటరీ సాగర్ రమేష్, నాయకులు వొల్లల నర్సగౌడ్, మంతెన వెంకటేష్, దుర్గ వినోద్, అల్లూరి వినోద్ కుమార్, రుబెన్, వికాస్, సురేష్, ఆదర్శ్ కుమార్ పాల్గొన్నారు.



## నేడు భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, భీమ్ సేన, ట్రైబల్ ఆర్మీ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోసిక మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మాల సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 1న ఎస్సీ, ఎస్టీల ఉపకులాల వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఆగస్టు 21న భారత్ బంద్‌కు పిలుపు మేరకు బంద్ పాటించాలని కోరారు. 2004లో ఐదుగురుతో కూడిన ధర్మాసనం ఎస్సీ, ఎస్టీల ఉపకులాల వర్గీకరణ సాధ్యం కాదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని తీర్పించిందని గుర్తు చేశారు. ఇది ముమ్మాటికి సుప్రీంకోర్టు తీర్పుగా మేము భావిస్తాలేమని ఇది నరేంద్ర మోడీ తీర్పు గానే భావిస్తున్నామని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకంగా భారత్ బంద్ ను స్వచ్ఛందంగా ఆర్టీసీ, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రయివేటు రంగ సంస్థలు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాలని కోరారు.

## బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక అన్నారు. బేటి బచావో-బేటి పడావో పథకంపై బాలికల, మహిళల సంరక్షణపై మంగళవారం శ్రీరాంపూర్ ఎయిమ్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భేటీ బచావ్-భేటీ పడావ్ పథకం, పిసిపిఎన్ డీటీ యాక్ట్ (గర్భస్థ శిశువు లింగనిర్ధరణ చట్టం) లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 1930, సఖి సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజెన్ హెల్ప్ లైన్ నంబర్ 14567, ఫోక్సో ఆక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ నెంబర్ 112, సుకన్య సమదియోజనా, మిషన్ వాత్సల్య, ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మైదం రామకృష్ణ పాల్గొన్నారు.

## గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



నవతెలంగాణ-మంచిర్యాల

బీసీ ఉద్యమాన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామస్థాయి నుంచి తీసుకుపోవాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల కేంద్రంలో మంగళవారం బీసీ భవన్‌లో నిర్వహించిన జిల్లా ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశంలో బీసీ సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరిట బీసీ లకు అనేక రకాల హామీలు ఇచ్చాని, బీసీ జన గణన ఆరు నెలల్లో చేస్తామని, స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42 శాతం కేటాయించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కానీ అధికారంలో వచ్చిన కాంగ్రెస్ బీసీ ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. దీన్ని బీసీ సంఘం నాయకులు తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. బీజేపీ గతంలో జరిగిన ఎన్నికలలో దేశవ్యాప్తంగా బీసీల కుల గణన చేస్తామని చెప్పి ఈ రోజు ఆ మాటను నిలబెట్టుకుండా బీసీ లను మోసం చేసిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కులగణన చేయాలని డిమాండ్ చేశారు. కుల గణన చేయకుండా స్థానిక ఎన్నికలను నిర్వహించాల్సి వస్తే కాంగ్రెస్ తన డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రకారం 42 శాతం బీసీ ప్రజలకు కేటాయించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వడ్డేపల్లి మనోహర్, గుమ్ముల శ్రీనివాస్, నరెడ్ల శ్రీనివాస్, కర్రి లచ్చన్న, రాజేశం గౌడ్, బుద్ధి చంద్రమౌళి, వైద్య భాస్కర్, చంద్రగిరి చంద్రమౌళీ పాల్గొన్నారు.

## జీఎంను కలిసిన క్రీడాకారులు, కళాకారులు

నవతెలంగాణ-మందమర్రి

ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ క్రీడాకారులు, కళాకారులు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జీఎం దేవేందర్‌ని మంగళవారం జీఎం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, క్రీడల కార్యదర్శి కార్తీక్, క్రీడల సమన్వయకర్త రవికుమార్, జనరల్ కెప్టెన్ టి చిన్నయ్య, కెప్టెన్లు, సీనియర్ క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యలపై కలెక్టర్,ఎస్పీలకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా అఖిలపక్షం ఆధ్వర్యంలో మాజీ మంత్రి జోగు రామన్న జిల్లా రైతులు ఎదుర్కొంటున్న రుణమాఫీ సమస్యలపై కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంను వేర్వేరుగా కలసి వినతిపత్రాలను అందజేశారు. మంగళవారం వారి కార్యాలయాల్లో కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, రైతులకు సమస్యలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కొంతకాలంగా రైతులు చేను పనులు మానేసి బ్యాంకుల రుణమాఫీ కోసం నానా అవస్థలు పడుతున్నారని తెలియజేశారు. రైతులకు ఇబ్బందులు ఎదురై ఆందోళన కార్యక్రమాలతో రైతులు, రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కలెక్టర్ స్పందిస్తూ రుణమాఫీలో కొంత వరకు చిన్నపాటి లోపాలు తలెత్తాయని త్వరలో వాటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు బండి దత్త్రాత్రి, నాయకులు వెంకట్ నారాయణ, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జగన్, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రైతు నాయకులు కొండ రమేష్, లోకారి పోశెట్టి, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్, బట్టు సతీష్ పాల్గొన్నారు.

## న్యాయవాదిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

నవతెలంగాణ-ఖానాపూర్



హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది సంతోష్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం ఖానాపూర్ కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఇచ్చిన పిలుపులో భాగంగా న్యాయవాదులు ఒకరోజు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాది పరిరక్షణ చట్టం అమలులోకి తేవాలని అన్నారు. న్యాయవాదులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందులో న్యాయవాదులు వెంకటమహేంద్ర, మట్టెరి రాజశేఖర్, షబ్బీర్ పాషా, పరమేశ్వర్ యాదవ్, సలీం ఖాన్, ఖదీర్ ఉన్నారు.

## బస్టాండులో చోరీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బస్టాండులో మంగళవారం సాయంత్రం చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన బాధితులు మంథని రవీందర్ వృత్తిరీత్యా బెల్లంపల్లి వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చాడు. బస్టాండ్‌లో జనాలు కిక్కిరిసి ఉండడం అదే సమయంలో బస్సు రావడంతో వారందరితో పాటు బస్సు ఎక్కాడు. టికెట్ కోసం డబ్బులు తీయడానికి ప్రయత్నించే క్రమంలో రూ.1200తో ఉన్న పర్సు కనిపించలేదు. పర్సు చోరీకి గురైందని కండక్టర్‌తో చెప్పాడు. ఏది ఏమైనా రద్దీ సమయంలో బస్టాండ్‌లో ప్రత్యేకంగా పోలీసులను ఉంచితే ఇటువంటి వారి నుండి ప్రజలను రక్షించే అవకాశం ఉంటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు.

## రైతులకు రుణమాఫీ అయ్యే వరకు పోరాడుతాం



నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో చేసేంతవరకు రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గంధం రమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి మండల వ్యవసాయ అధికారికి రైతు రుణమాఫీపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రావాలని అమలు కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని గద్దెనెక్కిన తర్వాత రుణమాఫీలో, కానిపోని నిబంధనలు పెట్టి రైతులను మోసం చేస్తుందన్నారు. రుణమాఫీ రాని రైతులు ధర్నాలు చేస్తుంటే రైతులపై కేసులు నమోదు చేసి, భయభ్రాంతులకు గురి చేస్తున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే రైతులపై కపట ప్రేమ తప్ప రైతులకు ఎటువంటి లాభం లేదన్నారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అనుభవిస్తున్న పదవీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెట్టిన బిక్షేనని అన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రైతు రుణమాఫీ అందే విధంగా రైతుల పక్షాన నిలబడి పోరాటాలు ధర్నాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, కృష్ణ, రఘు, కాంతారెడ్డి, అశోక్, భరత్, చంద్రన్న, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఖమ్మం నుండి రాష్ట్రంలోని కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, ధరణి, నూతన రెవిన్యూ చట్టంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రానున్న 5 రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని అన్నారు. అందువల్ల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండడంతో పాటు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని, ముఖ్యంగా ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. వర్షాల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని, ఎక్కడైనా సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న అన్ని ధరణి సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగవంతం చేయాలని, గతంలో ఏవైనా డాక్యుమెంట్లు అప్లోడ్ చేయనట్లయితే ఇప్పుడు అప్లోడ్ చేసేందుకు అవకాశం ఉన్నందున అలాంటి వాటినిగుర్తించి అప్లోడ్ చేయించాలన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు రానున్న కొత్త రెవిన్యూ చట్టంపై ఈ నెల 23, 24 తేదీలలో వర్క్ షాప్‌లు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఇతర అధికారులు రాష్ట్రస్థాయి నుండి హాజరు కాగా, జిల్లా నుండి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీఓలు వినోద్ కుమార్, జివాకార్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అందరం సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం భట్‌తో కలిసి సీజనల్ వ్యాధుల నియంత్రణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులలో ముఖ్యంగా మలేరియా, డయేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నందున, ఈ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలలో ప్రయివేటు ఆస్పత్రులలో చికిత్సకు వచ్చే వ్యక్తులకు అవసరం మేరకు రక్త నమూనాలను పరీక్షించి వారిలో ఎవరికైనా పాజిటివ్‌గా రిపోర్టు వస్తే వారి వివరాలను ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి నిర్ణీత ప్రొఫార్మాలో పంపించాలన్నారు. గ్రామాలలో ప్రజల సౌకర్యార్థం వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, గ్రామీణ ప్రాంతాలలో నిరంతరాయంగా పారిశుద్ధ్య పనులు కొనసాగుతున్నాయన్నారు. ప్రయివేట్ ఆస్పత్రులలో వైద్యులు, సిబ్బంది వివరాలు అందించాలని, ఆయా ఆస్పత్రులలో అందించే వైద్య సేవల ధరల పట్టికను ప్రదర్శించాలని తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు చెన్నకేశవ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉపవైద్యాధికారి సీతారాం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, ప్రయివేట్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.

**వర్షాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు**

జిల్లాలో వర్షపాత తీరును బట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వివరించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివిధ ప్రభుత్వ పథకాలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీఓలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నాలుగు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జన జీవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, చెరువులు, కాలువలు దెబ్బతినకుండా జాగ్రత్త చర్యలు చేపడతామని, రహదారులు, వంతెనలు, కాజ్ వేలు, వాగుల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ, ఉద్యానవన పంటలు దెబ్బతినకుండా చర్యలు చేపడతామని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నూతన ఆర్ఓఆర్ రెవెన్యూ చట్టంపై రైతులు, మేధావులు, నిపుణులతో వర్క్ షాప్ నిర్వహించి అభిప్రాయ సేకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఆదిమ గిరిజనుల అభివృద్ధికి చర్యలు**

దేశంలోని ఆదిమ గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ సంచాలకులు వైభవ్ గోయల్ అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుండి ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రధానమంత్రి జన్‌మన్ పథకం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి రమాదేవితో కలిసి హాజరయ్యారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద ఆదిమ గిరిజనుల(పీవీటీజీ)ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 3,615 గృహాల నిర్మాణానికి గుర్తించామని, గిరిజన గ్రామాలను జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ రహదారుల నిర్మాణం, ఆదిమ గిరిజనుల ఆవాసాలకు సురక్షితమైన తాగునీటిని అందించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుల పరిశీలన**

జిల్లాలోని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్ 2020 పథకంలో భాగంగా ఆగస్టు 26, 2020లోపు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల భారీగా దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణకు సాంకేతిక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ బృందాలు ఆయా లే అవుట్లలోని ప్లాట్లను పరిశీలన జరిపి క్రమబద్ధీకరణకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు. లే అవుట్ క్రమబద్ధీకరణ దరఖాస్తుదారుల సహాయం కోసం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, వివరాలకు 8919243616 నంబర్‌లో సంప్రదించాలన్నారు. దరఖాస్తుదారులు ప్లాట్ల క్రమబద్ధీకరణ, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాల్సి ఉంటే ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# శాశ్వత భవనాలు వెంటనే ప్రారంభించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేజీబీవీ బీసీ హాస్టల్‌తో పాటు వాంకిడి మండలంలో మూతపడిన వసతి గృహ భవనాలు వెంటనే ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కేజీబీవీ భవనం పూర్తయిన విద్యార్థుల తరలింపు చేయడం లేదన్నారు. బీసీ విద్యార్థులకు నిర్మిస్తున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్ పనులు వెంటనే పూర్తి చేసి వారిని అక్కడికి తరలించాలన్నారు. వాంకిడి మండలంలోని మూతపడిన ఎస్సీ బాలికల వసతి గృహంలో సమీకృత కళాశాల భవనం ప్రారంభించాలని దీని వలన మండల జూనియర్ కళాశాల చదువుకుంటున్న బాలికలకు హాస్టల్‌లో ఉండి చదువుకోవడానికి అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కళాశాల విద్యార్థులు ఉండటం వలన చదువుకోవడానికి పడుకోవడానికి ఇబ్బందిగా అసౌకర్యంగా ఉందని వెంటనే కళాశాల విద్యార్థులకు తక్షణమే అద్దె భవనంలోకి మార్చాలని కోరారు. విద్యార్థులకు మంజూరైన సోలార్ హీటర్లు అమర్చాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు తిరుపతి పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తు మంగళవారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై నాయకులు రుణమాఫీ కానీ రైతులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందన్నారు. మూడు విడతలుగా రుణమాఫీ చేసిన మరికొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. సాధ్యం కాని హామీలను ఇచ్చి రైతులకు అన్యాయం చేసిందన్నారు. రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా బీజేపీ రైతుల పక్షాన నిలబడి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సైలు సయ్యద్ ఇమ్రాన్, డి.సునీల్, మొగిలి పోలీసులు రాస్తారోకో చేస్తున్న నాయకులను రైతులను సముదాయించారు. పోలీసులు బలవంతంగా లేపి రాస్తారోకో విరమింప జేశారు. దాదాపు గంటన్నర సేపు రాస్తారోకో చేపట్టడంతో జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## నాణ్యమైన భోజనాలు ఆనందించాలి

నవతెలంగాణ-బోథ్



వసతి గృహంలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పట్నాపూర్ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలోని ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులకు వసతులు, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజన వసతులను పరిశీలించారు. నాణ్యమైన భోజనాలు అందించాలని హెచ్ఎంకుఆ దేశించారు. కార్యక్రమంలో బోథ్ ఈఓ అంజి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రుణమాఫీపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు
- 27న కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తీర్మానం
- పాస్ బుక్ ఆధారంగా రుణమాఫీ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చిన హామీ రుణమాఫీ విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న వ్యతిరేకంగా రైతులు నిరసనలు తెలుపుతున్నారని, కానీ వారిపై ప్రభుత్వం వారిపై నాన్ బెయిలెబుల్ కేసులు పెట్టడం సరికాదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు జోగు రామన్న, అఖిలపక్షం రైతు సంఘం నాయకులు అన్నారు. రుణ మాఫీపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం అఖిల పక్షం రైతు సంఘం ఆధ్వర్యంలో మున్నూరుకాపు సంఘ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా రైతు సంఘాల, పార్టీల నాయకులు పాల్గొని వారివారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులపై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం గొప్పలు చెప్పిందన్నారు. రుణమాఫీ కానీ రైతులు బాధతో సీఎంకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారన్నారు. అయితే వారిపై నాన్ బేయిలేబుల్ కేసులు పెట్టడం హేయమైన చర్య అని అన్నారు. ప్రభుత్వం రుణ మాఫీ పట్ల స్పష్టత ఇవ్వకపోవడం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారని, ఎక్కడికక్కడ గ్రామాల వారీగా నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. దానిలో భాగంగా మొన్న రూయ్యాడి గ్రామంలో నిరసన తెలియజేస్తే పోలీసులు కేసులు నమోదు చేయడం సరైందికాదన్నారు. కేసులను తక్షణమే ఎత్తివేయాలన్నారు. ఈనెల 27న మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేయాలనీ తీర్మానించినట్లు పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలు ఉన్నాయని, రేషన్ కార్డని, రెండు లక్షలపైన ఉన్నవారికని రుణాలు మాఫీ కాలేదని చెప్పడం సరైంది కాదు తక్షణమే పాస్ బుక్ ఆధారంగా రూ.2 లక్షల రుణం మాఫీ చేయాలన్నారు. ఇచ్చిన హామీని కూడా సక్రమంగా అమలు చేయకుండా రైతులకు ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల పక్ష రైతు సంఘం నేతలు బండి దత్త్రాత్రి, కొండ రమేష్, లోకారి పొశెట్టి, గోవర్ధన్ యాదవ్ లక్ష్మణ్, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేష్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసి నాయకులు వెంకట్ నారాయణ, ప్రజాపంతా నాయకులు జగన్ సింగ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీకి ఆదాయం రాఖీ పండుగ

- నాలుగు రోజుల్లో రూ. 94 లక్షలు
- అదనపు బస్సులున్న సరిపోని వైనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాఖీ పౌర్ణమితో పాటు వరుస సెలవులు రావడంతో సాధారణ ప్రజలతో పాటు ఆర్టీసీకి కూడా వరంగా మారింది. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు నాలుగు రోజుల్లో రూ.93 లక్షల రికార్డు స్థాయి ఆదాయం సమకూరింది.

**ఆర్టీసీకి ఆదాయం రాఖీ పండుగ**

రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఆదాయం పెరిగింది. రోజువారీగా రూ.16 నుండి 18 లక్షలు ఆదాయం రాగ అదనంగా ప్రతిరోజు రూ.నాలుగు నుండి రూ.పది లక్షలు ఆదాయం వచ్చింది. ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు రాఖీ పౌర్ణమి ఆదాయం పండుగను తెచ్చింది.

**నాలుగు రోజుల్లో రూ.94 లక్షలు**

గడిచిన నాలుగు రోజుల్లో ఆసిఫాబాద్ డిపోకు రూ.94 లక్షలపై చిలుకు ఆదాయం వచ్చింది. 16వ తేదీన రూ.19,40,380, 17న రూ. 22,09,764, 18న రూ.24,41,025, 19న రూ.28,27,050 ఆదాయం వచ్చింది. ప్రతిరోజు 33వేల కిలోమీటర్లు తిరుగుతుండగా నాలుగు రోజుల్లో గరిష్ఠంగా 38వేల కిలోమీటర్లు తిరిగాయి.

**అదనపు బస్సులు ఉన్న తప్పని తిప్పలు**

వరుస సెలవులు రాఖీ పౌర్ణమి నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు గతంతో పోలిస్తే అదనపు బస్సులు, ట్రిప్పులు నడిపించారు. అయినప్పటికీ మహాలక్ష్మి పథకంలో భాగంగా జీరో టికెట్‌తో నడుస్తున్న నేపథ్యంలో బస్సులు కిక్కిరిసిపోయాయి. మహాలక్ష్మిలో భాగంగా ఆసిఫాబాద్ డిపో పరిధిలో ఈనెల 16న 29,507 మంది మహిళలు ప్రయాణించగా 17న 33,300 మంది, 18న 35,615 మంది, 19 రాఖీ పౌర్ణమి రోజు 40,430 మంది మహిళలు ప్రయాణించారు.

## ప్రయాణికులకు ఇబ్బంది కాకుండా చర్యలు

విశ్వనాథ్, డిపో మేనేజర్

వరుస సెలవులు పండుగ నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది కాకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. బస్సులు అదనంగా నడపడంతో పాటు ప్రస్తుత బస్సులకు అదనపు ట్రిప్పులు కూడా కేటాయించాం. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని ఆర్టీసీలోని ప్రయాణించాలని సూచించారు. డిపో మరింత ఆదాయం తెచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు




నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని వడ్డేపల్లి గార్డెన్‌లో సైబర్ క్రైమ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం 30 సైబర్ క్రైమ్స్ నమోదైతే, ప్రస్తుత సంవత్సర ఇప్పటి వరకు 20 నమోదయ్యాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండకుంటే ఇబ్బందుల పాలు కావాల్సి వస్తుందన్నారు. డబ్బులకు సంబంధించిన వ్యవహారాలు జరిపే అప్లికేషన్లను ల్యాప్ ట్యాప్‌లో వాడకూడదన్నారు. నేరం జరిగినట్లు గుర్తిస్తే లేదా బాధితులు కనిపిస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలని సూచించారు. మోసపోయిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందు మోసపోకుండా చూసుకోవాలన్నారు. ఏఎస్పీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఆన్‌లైన్ చేయడానికి కొంతమంది వ్యక్తులు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి వారి ద్వారా మోసాలు చేయిస్తున్నారన్నారు. స్థానిక భాషలో మాట్లాడుతూ మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలో ఏదైనా సైబర్ క్రైమ్ నమోదైతే వెంటనే 1930కు లేదా సైబర్ క్రైమ్ డీఎస్పీ 8712665568 నెంబర్ సంప్రదించాలన్నారు. సైబర్ క్రైమ్ డీఎస్పీ రమేష్ బాబు మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలోని జాంతార అనే గ్రామంలో ప్రతి 10 మందికి 8 మంది సైబర్ క్రైమ్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్‌తో పాటు జగిత్యాల జిల్లా నుండి అనేక మందిని ఉద్యోగాల పేరిట తీసుకువెళ్లి సైబర్ నేరాలు చేయిస్తున్నట్లు గుర్తించి విజయవాడ కమిషనర్ పట్టుకున్నారన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల నివారణకు సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే వారిని సంప్రదించాలని తెలిపారు. అనంతరం సైబర్ నేరాల పట్ల పోలీసులు రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించడంతో పాటు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, సీఐలు సతీష్, రమేష్, ఎస్సైలు రాజేశ్వర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన జగదీశ్వర్ ఇటీవల ఆరోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మాజీ అధ్యక్షులు సిద్దం తిరుపతి, ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి, నస్పూరి నర్సింగ్, పుర్ర కుమార స్వామి యాదవ్, మేడ రాంచందర్ పాల్గొన్నారు.


కాసిపేటలో..

**లక్సెట్టిపేట:** పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫంక్షన్ హాల్‌లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి సాంకేతిక విప్లవాన్ని అందించిన ఘనత రాజీవ్ గాంధీకి సొంతమని పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత కోసం అహర్నిశలు కృషి చేసి దేశాన్ని అభివృద్ధిలో ముందు ఉంచారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

**వేమనపల్లి:** మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు పేదరిక నిర్మూలన, కమ్యూనికేషన్, టెక్నాలజీ రంగాలకు గట్టి పునాదులు వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గాలి మధు, వేమునూరి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఒడిల రాజన్న, పూర్ణచంద్రారెడ్డి, చెన్నూరి చందు, ఈర్ల మల్లయ్య, మోర్ల రమేష్, కొట్రంగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నస్పూర్:** మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ఆధ్వర్యంలో పట్టణంలోని సిసిసి కార్నర్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**జైపూర్:** 21 సంవత్సరాలకు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలకు కుదించిన భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ యువతకు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కల్పించాడని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భీమారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీకి నివాళ్లు అర్పించారు. ఈ సంధర్భంగా రాజీవ్‌గాంధీ దేశ ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్న నాయకులు ఆయన చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు


లక్సెట్టిపేటలో..


వేమనపల్లిలో..


జైపూర్‌లో..

## మోకు దెబ్బ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ జయంతి



నవతెలంగాణ-జైపూర్

కుల వృత్తుల వారిని ఐక్యం చేసి బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గోల్కొండ రవి గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం కుందారం గ్రామంలో గ్రామస్తులతో కలిసి సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఛత్రపతి శివాజీకి సమకాలికుడైన సర్వాయి పాపన్న గౌడ్ ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించి మొగల్ చక్రవర్తులను ధిక్కరించి పేద ప్రజల పెన్నిధిగా సమ సమాజ స్థాపనకు ప్రాణాలను పణంగా పెట్టిన వీరుడని పేర్కొన్నారు. గోల్కొండ కోటపై విజయ పతాకం ఎగురవేయడమే లక్ష్యంగా తుది శ్వాస వీడే వరకు పోరాడిన పాపన్న పేద ప్రజలను వెట్టి చాకిరి నుండి విముక్తి కలిగించారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ ఇజ్జగిరి సమ్మయ్య, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు సంతోషం చంద్రశేఖర్, వొడ్డాల శ్రీనివాస్ గౌడ్, రామగౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు చెన్నూరి శ్రీనివాస్ మాదిగ, మల్లేష్ పాల్గొన్నారు.

**తాండూర్:** ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జంతి ఉత్సవాలు మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమళ్ళ భాస్కర్‌గౌడ్ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి తాండూర్ మండల వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్‌కు సన్మానం




నవతెలంగాణ-జన్నారం

జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఏడున్నర సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తిచేసుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల వేములవాడకి బదిలీపై వెళ్లిన సీహెచ్ శరత్ కుమార్‌ను, నూతన ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లను అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.

## చీడపీడలపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరిలో చీడపీడలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. దింతో పాటు రైతులకు పంట రుణమాఫీ ఫిర్యాదులపై సందేహాల నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చల్లా ప్రభాకర్, వ్యవసాయ విస్తరణాధికారి కే దీప్తి పాల్గొన్నారు.

## రక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలి

● సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు రక్షణ చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలు, నూతన ఆర్ఓఆర్ చట్టం, ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తుల పరిశీలన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షపాతం నమోదు అయ్యే ప్రాంతాలలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షపాతం జోన్లలో అత్యవసరాల మేరకు రక్షణ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 23, 24 తేదీలలో జిల్లా స్థాయిలో నూతన చట్టం గురించి ప్రజలు, మేధావులు, నిపుణులకు వివరించి వారి నుండి సలహాలు, సూచనలు స్వీకరించాలని, వాటిని రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నిర్వహణ కొరకు జిల్లా స్థాయి, గ్రామ పంచాయతీ స్థాయి అధికారులు, మున్సిపల్ కమీషనర్లతో బృందాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను పరిశీలించాలని, దరఖాస్తులు



తిరస్కరించబడినట్లయితే సదరు కారణాన్ని రిమార్కు కాలములో స్పష్టంగా తెలియజేయాలని తెలిపారు. దీనికి ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, గ్రామపంచాయతీ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి చర్యలు తీసుకోవాలని తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధరణి పోర్టల్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో జన జీవనానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకుంటున్నామని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలు, నివాస గృహాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సూచనలను పాటించాలి



నవతెలంగాణ-జన్నారం

వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం జన్నారంలో రైతు వేదికలో పలు గ్రామాల రైతులకు వరి పంట సాగులో తీసుకోవలసిన చర్యలు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. వరి ఎదుగుదలలో మార్పులు వస్తే వ్యవసాయ అధికారుల సూచనలను తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సంగీత, ఏఈఓ త్రిసంధ్య, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## తినుబండారాల విషయంలో పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-నస్పూర్

పరిశుభ్రత పాటించని హోటళ్ళు, బేకరీలు, తినుబండారాలు దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. మంగళవారం నస్పూర్ కాలనీ పరిధిలోని బెంగళూర్ బేకరీలో శుభ్రత లేకుండా తిను బండరాలను తయారు చేస్తు అలాగే బేకరీ వంట గదిలో చిమ్నీ లేకపోవడంతో యజమానికి రూ.10 వేలు జరిమానా విధించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ నిషేధించిన ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రపంచ దోమల దినోత్సవం

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని సబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రోగ్రాం అధికారి, కీటక జనిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాతావరణ మార్పుల ద్వారా వ్యాపించే కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ దోమల వలన వ్యాపించే వ్యాధులు, నివారణ చర్యలతో కూడిన కరపత్రాలు అందించారు.